# చాదస్తం

## 1

"యేం బావా! మా మీద దయ తలచావు? డబ్బు మిగుల్చుకుందామనా లేక కులం నిలుపుకుందామనా? నా చేతి వంట తింటే నీ గౌరవం పోదూ? నేను యెర్రగడ్డలూ వెల్లుల్లి వాడతాను. ఆయనగారేమో శాకాహారి కాదు, వారి వర్ణం తెలుసుగా?" అలా బంధువునాహ్వానించింది రమా.

ఒక సంచీ మాత్రం చేతిలో వున్న గౌరీశంకర్ నవ్వుతూ లోపలికొచ్చాడు, కాళ్ళకు నీళ్ళిచ్చి కుర్చీ చూపింది.

ఇలాంటి చాతుర్యం గల మాటలు వినాలనే వచ్చా రమా. మీ అమ్మ నన్ను తిట్టింది, అంత పట్నమూ వెళ్ళి నా కూతుర్ని చూడకుండా వచ్చేశావా? నీకు నేను వూరగాయలూ, అప్పడాలూ, వడియాలూ పెట్టివ్వాలా? నా కూతురు పనికి రాదా? నలుగురు నిన్ను సహపంక్తి భోజనానికి పిలవరా అని గంతులేసిందత్తయ్య. మీ ఆయనా? మావేపు వాడే, బిళ్ళగోచీ పెట్టి ధోతీ కట్టడని, విభూతి వాడడనీ అలా గేలిచేసి అబ్రాహ్మణుడని సరసాలాడారు అని నవ్వాడు. కాళ్ళు కడుక్కుని కూచున్నాడు.

నన్ను విశ్వకళా పరిషత్తువారు నాటక కళమీద ఉపన్యాసం దంచమని ఆహ్వానించారు. కాని నన్ను తీసికెళ్టానికీ, బస చూపటానికీ యెవరూ స్టేషనుకి రాలేదు.

అందుకని నేను గుర్తు వచ్చి వెతుక్కుంటూ వచ్చావు, యెప్పుడివ్వాలి ఉపన్యాసం? అని అడుగుతుండగా రమా భర్త సారథి వచ్చాడు. అతిథిని చూశాడు.

ఇప్పుడేనా రావటం? వీళ్ళువాళ్ళంతా బావున్నాగా, నాకు కొన వెర్రి ఉన్నదనీ, వాళ్ళమ్మాయి గనక నాతో వేగుతున్నదనీ నలుగురితో అంటూ ఉంటారా? మీ పక్కన కూచుని తినాలేమో నేను, స్నానం చేసి గోచిపోసి కట్టి పీటమీద కూచోవాలా? నా అర్ధాంగి యివాళ పొద్దున్నే స్నానం చేసింది, ఇవాళ కొళాయి వదలలేదు, దేనికీ పొద్దున్నే నీళ్ళు వేస్టు చేస్తున్నావు అనడిగితే, కార్తీక సోమవారమని వంటింట్లోకి పారిపోయింది. అచ్చం తన తండ్రి పోలిక గదండీ? తిథులూ, వారాలూ వర్జ్యాలూ రాహుకాలం అన్నీ నోట్ డౌన్ చేస్తుంది, నేనుండగానే ఆకామాపై గూడా చేసేస్తుందేమో అంటూ దుస్తులు మార్చుకోటానికి వెళ్ళాడు.

ఆ కామాపైకి యెవరూ పోక్కర్లేదు. మీ తల్లిగారూ చేసిందిగా, ఆమెనెవరూ యెద్దేవా చేయలేదే. నా పక్కన కూచుని తినగలరా అసలు? మీవి టేబిల్ మీల్సు. నేను పీట మీద బాషి పీటవేసి కూచుని ఔపోసన పట్టి తినాలి. ఔపోసన యెటు తిప్పాలీ. ఉత్తరాపోశనం గుర్తున్నదీ అని లేచాడు అతిథి. స్నానం చేయాలి నీళ్ళెక్కడున్నాయో అనుకుంటుండగా సారథి వచ్చి స్నానాలగదికి తీసికెళ్ళాడు. కాళ్ళు ముడవగలరా? నిలువుజీతమైపాయె అని నవ్వుతూ స్నానం ముగించాడు. సెలవు కావటంవల్ల పిల్లలు వీధిలో క్రికెట్ ఆడుతున్నారు. ఆడపిల్లలు సంగీత కళాశాలకెళ్ళారు.

భోజనం వేళైంది, రమా భోజనం పెడ్తున్నది.

అయనెవర్నో, విద్రోహులను అరికట్టాలని కేరళనించి రమ్మన్నారుట. రావద్దు, నువ్విక్కడే ఉండు నాకేమీ కాదు

అని భార్యతో అన్నాడటాయన, అంటే వినకుండా, ఆయన సతీమణి వెంటబడి విద్రోహులనణిచే చోటికి భర్త వెంట వచ్చేసిందట. తాను పేపర్ చదువుతూ, వార్తలు వింటూ ఉంటానని తెలియాలని అన్నాడు అతిథి.

పోతే యిద్దరం కలిసేపోతాం, నేను కూడా వుండాల్సిందే అని వచ్చేసింది, దానినే మీ పరిభాషలో పాతివ్రత్యం అంటారు గదూ అన్నాడు సారధి.

ఒకరు టేబిల్ మీల్సూ, మరొకరు పీటమీద కూచుని ఆకులో భోజనం పూర్తిచేసి లేచారు. ఒకరు బేసిన్‌వేపు వెళ్తే, రెండో వారు మరచెంబు నీళ్ళతో వరండాలోకెళ్ళారు.

ఒక ఆఫీసరు సిటి ఓ, ఆయన కూతురు షాలినీ వచ్చారు. హాలులో కూచోబెట్టి వచ్చింది రమా.

వీళ్ళిద్దరూ హాలులోకెళ్ళి పలకరించి కూచున్నారు.

ఇవాళ హౌస్ వామింగ్ సెరిమొనీ, వెసులుబాటు లేక ముందే రాలేకపోయినాము. సారీ, సాయంత్రం అయిదు గంటలకి టీకి ఫామిలీతో రండి అని ఆహ్వాన పత్రిక అందించాడు ఆఫీసరు.

నేను అతిథిని, నాకు వేరే పని ఉన్నది అన్నాడు గౌరీశంకర్.

ఫరవాలేదు, మీరు రావాల్సిందే, మీకు పని ఉన్న చోటికి నా కారులోనే తీసికెళ్తా. ఈ ఊరంతా నాకు కొట్టిన పిండే అని లేచింది షాలిని, మోడన్ అలంకారం, పంజాబీ దుస్తులు తండ్రి అంత యెత్తునా యెదిగింది.

5235
శ్రీకాకుళం

సరే వస్తా అన్నాడు గౌరీ శంకర్.

వాళ్ళు వెళ్ళిపోయారు, రమా పిల్లలు వచ్చారు, సారధి రమావంక చూస్తూ అన్నాడు, షాలిని మూతీ వాళ్ళ నాన్న మూతీ ఒకే మోస్తరున్నాయి గదూ, పదమూడో యేడే, తండ్రి అంత యెత్తునా యెదిగింది.

కావచ్చు, కాని నేనంతగా మూతులు పరిశీలించలేదు సుమండీ, వక్కపొడి, ఆకులు, సున్నం లైటర్, సిగరెట్ టిన్ యివిగో అని గుండ్రని బల్లమీదుంచి వెళ్ళింది.

మా డాడీకి థర్టీస్ తప్పితే దానిపై నంబర్ గుర్తు రాదు. షాలిని యం కాం చదువుతున్నది, కారు లైసెన్సు కొట్టింది, థర్టీన్‌కి లైసెన్సివ్వరు డాడీ! మేము రాలీలో పాల్గొనాలి, అటు నించి పార్టీకి వస్తాంలే, మీరు ముగ్గురూ వెళ్ళండి అని వెళ్ళారు.

అతిధి బెడ్‌రూమ్‌లో మంచం మీద వాలాడు. సారధి హాలులో కూచుని దినపత్రిక తిరగేస్తున్నాడు. ఒకామె నోము నోచుకుని పసుపు కుంకం పంచుకోటానికి వచ్చింది, నిలబడింది. రమా వంటింట్లో గిన్నెలు సర్దుతున్నది. కిటికీలోంచి చూసింది గానీ అప్పడాలు, వడియాలూ అమ్మే మనిషి అనుకున్నది. సారధి పత్రిక తిప్పుతూ ఆమె నిలబడే వుండటం చూసి అడిగితే చెప్పిందామె, లేచి వంటింట్లోకెళ్ళి, ఆమె గ్రామనోము నోచుకున్నదిట, పధ్నాలుగు బస్తాల పసుపుకొమ్ములూ, కుంకుమ పంచుకోవాలిట. పళ్ళెం తీసుకుని నువ్వు వస్తే పసుపు కుంకం అందులో వుంచి బొట్టుపెట్టి వెళ్తుందిట, నిలబడే వున్నది అని పిలుచి వెళ్ళాడు.

## 2

సంచీ సద్దుకుంటూ అతిథి అన్నాడు. నేనింక వెళ్లా లమ్మాయి. నీ వల్లభుడు అతిథి మర్యాదలు బాగా చేశాడు, సంతోషం కలిగింది. నా ఉపన్యాసం వింటూ విద్యార్థులు 'పోజులు పెడ్తున్నా' డన్నారు. నేనూ వాళ్ళనేడిపించాను, నా డిగ్రీలన్నీ పేర్కొన్నా, తెలుగు సంస్కృతంలో యేదడిగినా చెప్పగలను. మీరంతా యేదో అంతా తెలిసినట్టు పోజులు పెట్టక, మీకు తెలియనివి అడగచ్చు, అంటే ఒక్కడూ లేచి రాలేదు, నువ్వు మన ఆచారాలు మరిచిపోలేదు.

సారధి జీప్ తెచ్చాడు, రమా ధోవతుల చాపు అందించింది అతిథికి, కాళ్ళకు దణ్ణం పెడుతూ అన్నది, "మా బావ వెళ్తాడుట."

అప్పుడే తోలేస్తున్నావేం, ఇవాళ రాత్రి ఒంటిగంటకి వెడ్డింగ్ సెరిమొనీకి హాజరు కావాలి, ఇదుగో ఇన్విటేషన్, ఆఫీసులో యిచ్చి పోయినారు, ఫోన్ చేశారు అన్నాడు సారధి.

నాకు శ్రీశైలంలో పండిత సన్మానమున్నది వెళ్ళాలి అన్నాడతిథి.

దీన్ని గూడా తీసికెళ్ళండి, వనిలో వనిగా శ్రీశైల శిఖరం చూపించండి ఇది అర్థడామ్సు.

నేను పోనండి, శ్రీశైల శిఖరం చూస్తే జన్మరాహిత్యం అవుతుంది, నాకు కైవల్యం అక్కర్లేదు, జన్మ పరంపరలచేత ఒక్కో కోరికే తీర్చుకుంటా. మొదటి జన్మలో మోడరన్ లైఫ్ నేర్చి ఒళ్ళు కనబడే దుస్తులూ లోనెక్ రవికా, పాంటూ, మోడరన్ హెయిర్ స్టైల్ నేర్చి మగవాళ్ళనాకర్షించాలి. రెండో

జన్మలో అంటుంటే వాళ్ళిద్దరూ పెద్దగా నవ్వుతుండగా, పెళ్ళికి పిలిచేవారొచ్చారు.

యీ జన్మలో అవి సాధ్యం గావు. జన్మరాహిత్యం వల్ల యేమీ ఒరగదు అన్నది.

వచ్చినవాళ్ళు బొట్టుపెట్టి, ఆహ్వానపత్రిక యిచ్చి వెళ్ళారు.

నన్ను యిదివరకే సి ఇ గారి భార్యా వాళ్ళ వాన్‌లో శ్రీశైలం వెళ్ళమన్నారు. అవిడా సియీ గారూ కాంప్ వచ్చినప్పుడు స్వంతకారులో యింటికి తెచ్చి దిగడుస్తారుట, వాళ్ళు వచ్చేదాకా సత్రం గదిలో ఉండచ్చు నన్నదావిడ, కాని సి ఇ గారంతా విని నవ్వారుట. నీకు పిచ్చా? చాదస్తమా? ఆవిడ శ్రీశైలం చూస్తాననాలే గాని, దేవాదాయ శాఖవారు, దేవస్థానంవారూ తీసికెళ్ళి మల్లికార్జునుని దర్శనం చేయిస్తారు. ఆమె పెద్దన్నకక్కడే పని, ఆయన మల్లికార్జునుని మీద శతకం రచిస్తే దేవస్థానంవారు ప్రచురించారు అన్నాడుట.

పెళ్ళికి పిలిచి వెళ్ళినవారిలో ఒకాయన వెనక్కు వచ్చాడు లోపలికి అతిథిని చూస్తు అన్నాడు.

మీరు కూడా రండి పండిట్‌జీ. శాస్త్రీయ సంగీతం, గాన కచేరీ, భరతనాట్యం ప్రోగ్రామ్స్ అరేంజ్ చేశాం. మగపెళ్ళివారవన్నీ పెట్టాలన్నారు. మీరు వాటిని వ్యాఖ్యానిస్తూ వ్యాసం వ్రాసి దినపత్రికకు పంపుదురు గాని, మేము ఆ వ్యాసం దినపత్రికలో పడేట్టు చూడగలము. కళాకారులు సంతోషిస్తారు, తప్పక రావాలి అని వెళ్ళిపోయాడు.

అతిథి ప్రయాణం ఆపేశాడు.

పెళ్ళి వైభవంగా జరుగుతున్నది, తండ్రికి బిజినెస్‌లో లాభం వచ్చిందట, అదంతా ఖర్చు చేస్తున్నాడట, నల్లధనం తన వద్ద లేదని ఐటీవారు తెలుసుకోవాలిట దీపాలంకరణ వివాహవేదిక అన్నీ చూస్తున్నది రమ పిల్లలు ఐస్‌క్రీమ్ నాకుతూ తిరుగుతున్నారు.

సారథి మధ్య వున్నాడు, రెండువేపులా రమా, అతిథీ ఉన్నారు, సోఫా మెత్తగా ఉన్నది.

నాకసలిటువంటి వాటిల్లో నమ్మకమూ లేదు యిష్టతా లేదు, యేదో పెళ్ళి జరిగిందనిపిస్తే చాలు. చాలా డబ్బు వేస్టు చేశారే అని గ్రూమ్ లేచిపోతుంటే, తల్లీదండ్రీ లేవరాదని బలవంతంగా కూచోబెట్టారు. పెళ్ళికూతురేమో సివిల్ మారేజ్ చేసుకుంటాము అన్నదిట. దానిమీద తాతగారింతెత్తునెగిరి కొట్టబోయినాడట మనమరాల్ని అంటున్నాడు సారథి.

యెంత చక్కగా నిదానంగా తలంబ్రాలు పోసుకుంటున్నారో, యెన్ని ఫొటోలు తీస్తున్నారో! పెళ్ళికొచ్చినవారికీ, బహుమతులిచ్చేవారికీ గూడా తీస్తున్నారు. యెంత సంబరమో! అనుకుంటూ సారథి వంక చూసింది రమ.

ఆడపెళ్ళివారొచ్చి పన్నీరు చల్లి వేడిగా తాగే పానీయమిస్తున్నారు. పెళ్ళి జరిగే హాలంతా పరిమళంతో కూడిన పూదొత్తు పొగ వ్యాపిస్తున్నది.

3

రాత్రి పదయింది, సారథి ముసుగుతీసి చూశాడు, అది డబుల్ బెడ్, రమా టేబిల్ లాంప్ వెలుగులో నవల చదువు తున్నది, వెల్లికలా పడుకుని దుప్పటి నడుం వరకూ కప్పు కున్నది.

యేమిటి చతువుతున్నావు? మాలతీ మాధవమా, నాక్కూడా చెప్పు, వింటాను అన్నాడు.

కాదు. చెప్పినా మీకర్థం గాదు, జోకొట్టినట్టూ, జోలపాడు తున్నట్టు నిద్రకొరుగుతారు, ఇది అపరాధ పరిశోధక నవల అన్నది.

నిద్ర అంటే గుర్తు వచ్చింది, మనం పెళ్ళికి వెళ్ళామే మీ బావ వచ్చినప్పుడూ, ఆ పెళ్ళికూతురు శిరీష రిసెర్చి చేయటమైపోయింది. థీసిస్ వ్రాస్తుంటే, ఆ మొగుడు ఒట్టి మొరటు మనిషి, నాజూకులు తెలియవు, లైటార్పి బెడ్మీదికి రమ్మని లాగేవాడుట. యేమి చేస్తుంది పాపం ఆడపిల్ల! ఇప్పటినించే పిల్లలొద్దు, జాబ్‌లో చేరాక కంటాలెండి అని తప్పించుకోవాలని చూస్తే ఆ బ్రూట్ వింటేనా? బర్త్ కంట్రోల్ మెథడ్స్ పాటిస్తున్నావా అని ఉరిమి లైటార్పి, థీసిస్ అవత లికి గిరవాటేసి, చెయ్యి పట్టుకు లాగాడుట అంటున్నాడు నిద్ర కళ్ళతో లైటు మీద పడకుండా ఉండేందుకు కళ్ళమీది వరకు దుప్పటి లాగి యింకా చెప్తూనే ఉన్నాడు సారథి.

మా అన్న కొడుక్కి పిల్లనిచ్చారా? పెళ్ళిలో పెళ్ళి కూతురు పేపు వాళ్ళంతా దీనికెంత మంచి సంబంధమొచ్చింది

అని అసూయ ఔందారుట, సుమతి మామగారు అనే మాటలు పడలేక అమెరికా వెళ్ళిందిట.

ఓహో! వార్తలు బావున్నాయి గానండీ సారథిగారూ! మీరు చాదస్తం కంట్రోల్ చేసుకుంటే బావుంటుందేమో, శిరీష థీసిస్ పెట్టేసింది, పెళ్ళయి యిది నాలుగోయేడు, ఒక అబ్బాయిని కని అత్తగారి చేతిలోనూ, ఒకమ్మాయిని కని తల్లి చేతిలోనూ ఉంచింది. శిరీష మామగారేమో నేడు కొత్తగా వస్తున్న నగ అయిదువేల వెలగలది కొని కోడలికివ్వమని అత్తచేతికిచ్చాడు. శిరీష తల్లి, ఆ నగ యివాళే నాకు చూపించింది. రెండు కాన్పులు నార్మలే, శిరీష తండ్రేమో శిరీషకు మంచి ఉద్యోగం చూసిపెట్టాడు, వెళ్ళి చార్జ్ తీసుకుంటుంది. సుమతి యేమో మామగారి మాటలు పడలేక గాదూ అమెరికా వెళ్ళింది. అక్కడున్న మిత్రుడు జాబ్ చూశాను రా అని వ్రాశాడుట, అందుకు వెళ్ళింది అని చెప్తూ పక్కకి చూస్తే సారథి ముసుగు నిండా లాగి గురక పెడ్తున్నాడు.

రమా నవల చదవటంతో నిమగ్నమైంది.

() — ()